


పోలంగి సుబ్బలక్ష్మి

రమాపతి రిక్షాలో స్టేషనుకు వెళుతున్నాడు తన స్వగ్రామం. పిల్లను చూసు కోవ టానికి తండ్రి రమ్మని ఉత్తరం వ్రాస్తే తను బయలుదేరాడు. ఇది తను నాలుగో సారి పిల్లని చూడటానికి వెళ్ళటం. ఇంతకు పూర్వం మూడుసార్లు ముగ్గుర్ని చూసాడు. పిల్ల అబ్బాయికి నచ్చక పోవ టమో, అబ్బాయి అమ్మాయికి నచ్చక పోవటమో .... మరేదో .... జరిగింది. అవేవీ సెటిల్ కాలేదు. ఏమయినా యిది ఆఖరి ప్రయత్నంగా తాను నిర్ణయించు కున్నాడు.

రిక్షా దూసుకు పోతోంది. ఎదురుగా భాస్కరం సైకిలుమీద వస్తున్నాడు. రమాపతి చూసాడు. కాని చూడనట్టే, తల వంచేసు కున్నాడు. అది చూసిన భాస్కరం "అమాయకుడు" అనే భావంతో నవ్వుకున్నాడు.

రమాపతి భాస్కరం ఒకే బ్యాంకులో ఉద్యోగస్తులు. యిద్దరివి వేరు వేరు కోణాలు. ఎప్పుడూ అతకరు. భాస్కరం ఉన్నది వున్నట్టు చూసే మనిషి. యింట్లో భార్యా భర్తలు కీచులాడు కోవటం దగ్గర మంచి—దేశంలో కొత్త కాంగ్రెసు, పాత కాంగ్రెసు చీలికలవరకు కూడా కారణాలు సమాజ స్వరూపంలోనూ, రాజ్యాంగ నిర్మాణంలోనూ ఉన్నాయని నిరూపిస్తాడు. సరిగ్గా దీనికి వ్యతిరేకం రమాపతి. పరమ నాస్తికుడని భాస్కరాన్ని ఒకసారి తిట్టి పోశాడు. దేవుడి గురించి తనకేవీ తెలియకపోయినా— పరమ ఛాందస లక్షణాలకి లొంగిపోయిన మనిషి రమాపతి. తనకు కాబోయే భార్య సీత, సావిత్రి, ద్రౌపది అంత మహా పతివ్రత అయ్యుండాలని అతని ఆలోచన. యీ విషయంలోనే రమాపతికి భాస్కరానికి వాగ్యుద్ధం వచ్చి చివరికి ఒకరితో ఒకరు మాట్లాడుకోవటమే మానేసారు.

ఆ సంఘటనని కావాలనే ఒకసారి గుర్తు తెచ్చుకున్నాడు భాస్కరం:

"ఎన్ని చెప్పు—స్త్రీలకు స్వేచ్ఛ అనవసరం. ఇల్లు కనిపెట్టుకుని భర్త హృదయంలో గూడు కట్టుకుని పతివ్రతా తిలకమై విరాజిల్లాలి స్త్రీ — అలాంటి స్త్రీనే వివాహం చేసుకుంటా నేను"— అన్నాడు రమాపతి.

"అలా అయితే నీకు పెళ్ళికాదు. ఒకవేళ అయినా నీ సంసార జీవితం సుఖంగా వుండదు. యిలా అన్నానని ఏవీ అనుకోవద్దు. పతివ్రతల రోజులు వేరు, వాళ్ళ సమాజాలు వేరు. వాళ్ళ చట్టాలు, కట్టుబాట్లు వేరు. అవన్నీ అంధయుగాలు. వాటినుండి ఎన్నో సంస్కరణలు చేసి దూసుకువచ్చి ఎంతో అభివృద్ధికి వచ్చాడు నేటిమనిషి. సమాజం ఎప్పుడూ ముందుకే నడుస్తుంది తప్ప వెనక్కుపోదు. నీలాంటివాడు మళ్ళీ వెనక్కుపోతానంటే — అది అవివేకం అంటాను"—భాస్కరం.

"లేదు లేదు సావిత్రి, సీత, దమయంతి మహా పతివ్రతలు భర్తలకోసం వాళ్ళెంత త్యాగమయినా చేశారు. అందుకే వాళ్ళ చరిత్రలు సజీవంగా విరాజిల్లుతున్నాయి. సరే అదలావుంచు—నేడు స్త్రీలను ఉద్యోగాలు చెయ్యమంటూ బయటికి వదిలేస్తే—పురుషులకు ఉద్యోగాలు లేక నిరుద్యోగం ప్రబలి పోతోంది"— గంభీరంగా అన్నాడు రమాపతి.

దీనికి భాస్కరానికి నవ్వాలో ఏడవాలో తెలియలేదు.

"నేటి నిరుద్యోగం స్త్రీల మూలంగానే అనుకుంటున్నావు నువ్వు. అది తప్పు. స్త్రీ లెప్పుడూ కారణంకాదు. స్త్రీలేకాదు అసలు సామాజికు లెవ్వరూ కారణంకాదు. అందుక్కారణం "రాజ్యాంగం" ఒక్కటే. రాజ్యాంగంలోని మేధావుల సూత్ర ప్రాయమయినా ఆలోచనా సరళే దేశ సౌభాగ్యానికి కాని, దౌర్భాగ్యానికి కాని కారణమవుతుంది—" అన్నాడు భాస్కరం.

"ఏమయినా కాని—స్త్రీలకు ఉద్యోగాల నవసరం. ఇంటిపట్టున వుండి సత్స్రీల వతులై యుండాలి. తమ హృదయంలో భర్త కొక్కడికే స్థానం యివ్వ గలగాలి" రమాపతి.

స్త్రీలమీద రమాపతికి వున్న అభిప్రాయాలు వింటున్న కొద్దీ వొళ్లు మండుతోంది భాస్కరానికి. అయినా కోప్పడటం అసమర్థుల లక్షణం అని తెలిసి శాంతంగానే చెప్పుకు పోయాడు—

"అయితే ఉద్యోగాలు చేసే వాళ్ళంతా దుశ్శీలవతులనా నీ అభిప్రాయం. సావిత్రి, సీత, దమయంతుల్ని దృషిలో పెట్టుకొని మాట్లాడు తున్నట్టున్నావు. వాళ్లు నిజంగా పతివ్రతలు కాదు. అప్పటి సమాజ సూత్రాలకి బలి అయిపోయిన మనుషులు. అంతరంగంలో క్రుంగి, కృశించినా, సమాజ దృష్టిలోనూ, భర్తల హృదయాల్లోనూ మహా పతివ్రతలై నిలిచారు. అసలు సత్స్రీల వతేవిటి, దుశ్శీల వతేవిటి — అలా విభజించటమే తప్పు. ద్రౌపది పంచ భర్తృక, సీత ఏక భర్తృక. మరొకతె రంకు భర్తృక.......వీళ్ళు ముగ్గురూ పతివ్రతలే అని ఆయా సమాజాలు ఒప్పుకున్నాయి. నువ్వూ ఒప్పుకుంటున్నావు."

"అవును. ముమ్మాటికి"—రమాపతి కోపంతో అరిచాడు.


"కోప్పడకు సాంతం విను. అలా అయితే మన సమాజంలో కూడా యీ మూడు కేటగరీలకు చెందిన స్త్రీలే వున్నారు. ఆంతకు మించివుండరు కూడా. అంచేత స్త్రీలందరూ పతివ్రతలేనని ఒప్పుకుని తీరాలి నువ్వు"—తీక్షణంగా రమాపతి కళ్ళలోకి చూస్తూ అన్నాడు భాస్కరం.

"ఛీ ..ఛీ ...మహా పతివ్రతలను నీ నాలుకతో కాలుష్యం చేసేసావు. రామాయణ, భారత, భాగవతాదుల సమగ్ర పరన లేకుండా మాట్లాడే నీతో నాకు వాదనేవిటి? వాళ్ళ పాతివ్రత్య నిరూపణకి యింకా అనేక ఉపాఖ్యానాలున్నాయి. అవన్నీ తెలియకే నువ్విలా మాట్లాడుతున్నావు" — గంభీరంగా ఉపన్యాసం యిచ్చి బయటికి వచ్చేశాడు రమాపతి.

అతని అమాయకతకి ఆరోజే నవ్వుకున్నాడు భాస్కరం. అది జ్ఞాపకంవచ్చి యిప్పుడు కూడా నవ్వుకున్నాడు. అప్పటి నుంచి నేటివరకు మాట్లాడుకోనే లేదు వాళ్ళిద్దరూ.

నేటి పెళ్ళికొడుకులు, ఆలోచనలు, అవకతవకలు....చివరకు పెళ్ళికొక అర్థం తెలియక, పెళ్లాం అంటే ఒక పవిత్ర వస్తువనుకొని, లేని పోని ఆలోచనలతో సతమతమయి, చివరకు బ్రతుకులో ఆనందం, సుఖం....వీటి అర్థం తెలియక, తన్ను తాను వంచించుకుని ఆత్మహత్యలు చేసుకొనే అసమర్థులు, బలహీనులు అనేక మంది వున్నారు. అలాంటివాళ్ళలో ఒకడు రమాపతి. అన్నీ తెలిసిన వాడికన్నా చెప్పొచ్చు లేక తెలియని వాడికన్నా చెప్పొచ్చు. పెళ్ళి దాని పూర్వాపరోత్తరాలు తెలిసిన సర్వజ్ఞుడు — పెళ్ళాం ఎలాంటిదయినా ఆనందించగలడు. బ్రతుకులో సుఖం చవి చూడగలడు. అలాగే ఏవీ తెలియనివాడు — అంటే—పెళ్ళి, పెళ్ళాం....వీళ్ళ నిర్వచనాలు, నిర్వచనోత్తర కావ్యాలు ఏవీ తెలియని వాడు కూడా బ్రతుకులో ఆనందం పొందగలడు. ఎప్పుడయినా కోపమొస్తే కొట్టగలడు. అంతలోనే తాపంతో అనుభవించ గలడు. విరక్తికలిగితే కత్తితో పొడవగలడు. ఏంచేసినా మనస్ఫూర్తిగా చేయగలడు. సర్వజ్ఞుడు—యివన్నీ చేయలేక పోయినా —అతనూ మనస్ఫూర్తిగానే అనుభవిస్తాడు సుఖాన్ని; మనస్ఫూర్తిగానే త్యజిస్తాడు దుఃఖాన్ని. యీ విషయంలో పండిత పామరులిద్దరూ ఒకటే. ఎటొచ్చి రమాపతి లాంటి మధ్యరకం మనుషుల్లోనే వుంది కథంతా. వీళ్ళకి అన్నీ తెలుసు. అలాగే ఏవీ తెలియదుకూడా. తెలుసు కుంటూనే తెలియ కుండానే పోతారు. తెలియకుండానే తెలిసిందను కుంటారు. సావిత్రి, సీత, దమయంతి....యింకా ఎందరో మహా పతివ్రతల కథలు తెలుసు. పతియేదైవమనే పడతుల కథలు అనేకం చదివి సంతోషించారు. వాళ్ళు ఏక భర్తృకలు, శీలవతులు, గుణవతులు, పరాయివాని కన్నెత్తి చూడని వారు, మంచివారు, పవిత్రులు, పతివ్రతలు.... యిలాంటివన్నీ గుండెల్లో నాటుకు పోయాయి. కాని వాళ్ళ సమాజాల్ని, సాంఘిక పరిస్థితుల్ని అర్థంచేసుకుంటూ అప్పటినియమాల్ని, నిబంధనల్ని తెలుసు కుంటూ ఆలోచించే మనసు, పరిశీలించే సూక్ష్మదృష్టి వాళ్ళకుండదు. అదే వాళ్ళ దురదృష్టం లేక మరేదో!

అలాంటి రమాపతికి—పతివ్రతా శిరోమణి కావాలి భార్య. తన భార్య మంచిదై యుండాలి. సచ్ఛీలవతి కావాలి. తన గురించే కాదు — కుటుంబం గురించి, సమాజం గురించి చాలా అవసరం. లేక పోతే నలుగురిలో అపమానం, సిగ్గు.




అసమర్ధత. కాని మంచి సంబంధం ఏది? ఎక్కడ? —— పెద్దవారి యిన్వెస్టిగేషన్‌లో పడింది బండి.

చదువు మినిమమ్ క్వాలిఫికేషన్ అయినా మెరిటుంది. అలాంటివి చూసే రోజులు కాకపోయినా——ఏదో "సుడి"—— లేక అలాంటి దేదో పనిచేసి బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. నెలకు మూడు వందలు దగ్గరగా సంపాదిస్తున్నాడు. మనిషి నల్లగా కొంచెం సన్నగా వుంటాడు. ముఖాన్ని చూస్తే బుర్ర ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్టు. బట్టతలని చూస్తే అధిక మేధస్సు వున్నట్టు కనిపించక తప్పదు, పరమభక్తుడు. ప్రతి సాయంత్రం గుడికి వెళతాడు. కాసేపు మంగళకర వాద్యాలు వింటాడు. పవిత్రమనస్కుడయి యింటికి వస్తాడు. సీఘ్ర, భోజనం ముగించి ఆఫీసువర్కు చూస్తాడు. నిద్రిస్తాడు. అంతా రొటీన్‌వర్కు. చేస్తూనేవుంటాడు. విసుగులేదు. కొత్తతనా న్నాశించడు. అయినా కొత్తతనం ఎక్కడిది? తన పనేదో తనది. నలుగురిలో మంచివాడు. నెమ్మదస్తుడు. ఎవరితోనూ పలకడు వులకడు. ఒకమాదిరి కళాకారుడు. అప్పుడప్పుడు బొమ్మలు గీస్తాడు. తానేసిన చిత్రాలు వందకుపైగా వుంటాయి. కాని వాటిని ఏ పోటీలకు పంపలేదు. ఎక్కడా ముద్రింపలేదు. తను చేసే ప్రతిపని లోనూ ఒక ఛందస్సు వుంది. ఒకతరహా వుంది. తాళ మేళ రాగాలున్నాయి. ఒక్కమాటలో పరమ పవిత్ర ఛాందసుడు.

పెద్దమనుషులు పిల్లను చూసారు. తండ్రి ఉత్తరం వ్రాసాడు అమ్మాయిని చూడటానికి ఫలానా రోజు రమ్మని.

అందుకే యీ రోజుతను బయలుదేరాడు. బండిలో కూర్చొని ఏదో వూహాలోకంలో విహరిస్తున్నాడు. వెర్రి వెర్రిగా ఆలోచించు కుంటున్నాడు.

యిక్కడ రమాపతి కుటుంబ విషయం కొద్దిగా చెప్పాలి. కుటుంబం అంత ఉన్నత మయిందికాదు. మధ్యరకం మనుషులు. నివాసం బాగా పల్లెటూరు. కొడుకును బాగా కండిషన్‌లో పెట్టి చదివించాడు తండ్రి. రమాపతి కూడా అక్షరాలా అభ్యసించి—చక్కగా చదివి ఏదో చిన్న ఉద్యోగం సంపాదించుకో గలిగాడు. అతని ఉద్యోగమే అతని స్థిరాస్థి, చరాస్థి కూడా.

అంతా ఆతని ఉద్యోగం చూసి పిల్లనిస్తామని వచ్చేవాళ్ళే. నేటికీ సత్యవతి సంబంధం వచ్చింది. అందుకే కొడుకును రమ్మని ఉత్తరం వ్రాసాడు తండ్రి. ట్రైనులో వున్న రమాపతి "సత్యవతి, సత్యవతి"....అంటూ ఏదేదో గొణుక్కున్నాడు, సాయంత్రానికి యిల్లుచేరుకున్నాడు.

* *

మరుసటిరోజు అంతా అమ్మాయిని చూట్టానికి వెళ్ళారు. పెళ్ళి కొడుకు వారు యిటు కూర్చున్నారు. వాళ్ళల్లో వాళ్ళే ఏవో ఉన్న విషయాలన్నీ మాట్లాడు కుంటున్నారు. అంతలో సత్యవతిని చక్కగా అలంకరించి తీసుకొచ్చారు. ఎదురుగా కూర్చోబెట్టారు.

ఆమెను చూడగానే రమాపతి హతాశుడయాడు. తనలాగే నల్లగావుంది. కాని కాకి నలుపుమాత్రం కాదు. కోకిలానలుపు. కలువనలుపు ....ఏదో సర్దుకున్నాడు. కళ్లు పద్మాలు. పసందయిన ముక్కు. ఒక వెన్నెల కిరణం రెస్టు తీసుకుంటున్నట్టున్న చిరునవ్వు పెదవులు. తనలో తానే యింకావర్ణించుకుంటున్నాడు.

"ఎలావుంది అమ్మాయి—" పెద్దమనిషిగొంతుభంగుమంది దాంతోకంగారు పడ్డాడు రమాపతి. యింకాతనో నిర్ణయానికి రాలేదు. ఏం చెప్పాలో తెలియలేదు. ఆమె నలుపు—విచారాన్నిస్తోంది. కళ్ళు, ముఖం, పెదవులు, వర్చస్సు—ఆనందాన్ని ఇచ్చాయి. ఏం చెప్పాలి? ఎలా చెప్పాలి? బాగాలేదు—బాగానే వుంది. ఏది నిర్ణయం? అంతా తికమకగా వుంది. రమాపతి బుర్ర, యీ తికమకలో పడి ఏదోలా పెట్టాడు రమాపతి, ఆ ముఖాన్ని ఎలాకావలిస్తే అలాగే అనునయించుకోవచ్చు.

"అబ్బాయి అంగీకరించినట్టే—" అబ్బాయి తరపు గుంపులో ఒకాయన అరిచాడు.

"అబ్బాయి అంగీకరించాడు. ముహూర్తం పెట్టించండి"—అన్నాడు పెద్ద మనిషి.

అమ్మాయిని లోపలికి తీసుకెళ్ళారు. హంసనడక ఆకర్షించే అవయవ పొందిక.



బలమయిన అవయవాలు. కాని చదువు లేదు. ఏదో అక్షరాలు వచ్చు. ఎద్యుకేటెడు ఫామిలీకాదు. ఆడపిల్లలకు చదువెందుకనుకున్నారు. పైగా పల్లెటూరు—డబ్బున్నా చదివించాలనే వాతావరణం అక్కడ లేదు. ధనం విషయంలో రమాపతి కుటుంబంకంటే వెయ్యి రెట్లు మెరుగు. పదెకరాలవరకు వుంది. ముగ్గురే అమ్మాయిలు మగపిల్లలులేరు. పిల్లలు ముఖాల్లో ధనమున్నహుందా కనిపిస్తుంది. హాయిగా తినటం. కమ్మగా నిద్రపోవటం—సూటిగా ఆలోచించటం. సత్యవతికి చక్కగా అలంకరించుకోవటం—శరీరానికి తగినట్లుగా దుస్తులు వేసుకోవటం. అంటే చాలా యిష్టం.

చిన్నప్పటి నుంచి సూర్యంతో కలిసిమెలిసి తిరిగేది. 'సూర్యం' తన మేనమామ కొడుకు. కండలు తిరిగిన శరీరం.

విశాలమయిన వక్షస్థలం ఉన్నాయి. తనకు సంబంధాలు రాకముందు సూర్యం తనకు మొగుడవుతాడని అనుకుంది సత్యవతి. అందుకే అతనితో 'బావ....బావ'— అంటూ మరీ చనువుగా తిరిగింది. కాని సూర్యం ఆర్థికస్థితి చిన్నది. పైగా చదువు లేదు. ఉద్యోగంలేదు. హోదాలేదు— అందుకే సహజంగా తల్లి దండ్రులు సూర్యంకు యివ్వటానికి ఇష్టపడలేదు. యీ నిర్బంధాలు 'రమాపతి'ని భర్తగా నిర్ణయించాయి. సత్యవతికి చదువు, ఉద్యోగం, హోదా ......ఇలాంటివన్నీ ఎందుకు? ఆమెకు తెలీదు వాటి విలువ. సూర్యం లాంటి మగాడు కంట, కైవారం ....నిండుగా వుంటే ఆమెకు ఆనందం. అయినా పెద్దవారి నిర్ణయం ఆమె కాదన లేదు. రమాపతి మీద ఆమెకు అసహ్యం లేదు. మనస్ఫూర్తిగా పెళ్ళికి అంగీక రించింది. ఆ క్షణాన్నుంచి సూర్యాన్ని మరిచిపోయింది కూడా. ఆమె బలమయిన యవ్వనం—మధురమయిన స్వప్నం— తీపికోరికలు—ఒక మగాడు కావాలి. అది ఎవరయినా ఆమె కక్కర్లేదు. అందుకు రమాపతి అర్హుడన్నారు గాబట్టి తాను సరే అంది. నవ్వుకుంది. ఆ రాత్రి కలలు గంది.

* *

పెళ్ళి తంతు పూర్తయింది. పెద్దలు పిన్నలు విచ్చేశారు. పంతులుగారు అమో నియానాన్సెన్స్ నుండి తేరుకొని కొంచెం స్పష్టంగా చదువుతున్నారు మంత్రాలు. ఎప్పుడో పాత పరిచయాలున్న ఆడవాళ్ళు పాత పరిచయాలున్న మగవాళ్ళను చూసి ముసిముసిగా నవ్వుకుంటున్నారు. కొందరు పలకరిస్తున్నారు. బాజా బజంత్రీలు మోగాయి. రమాపతి మంగళ సూత్ర ధారణ చేశాడు. సత్యవతి కళ్ళు ఆనం దంతో సంతోషంతో మెరిసాయి.

పెళ్ళి అయింది.

తల్లి సాగనంపుతూ కన్నీళ్ళు పెట్టు కుంది. సూర్యం వచ్చాడు. అతనూ చాలా ఆనందిస్తున్నాడు. అసూయ ద్వేషం అత నిలో లేవు. తనతోటే కలిసి తిరిగిన 'సత్య' ఎక్కడికో వెళ్ళిపోతోందంటే కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

"ఏం బ్రదరు—మా సత్యవతిని కాపాడుకోవలసిన భారం నీదే. నీ చేతిలో పెట్టాం"—అన్నాడు.

రమాపతి మనసు గొణుక్కుంది.

"వేరే చెప్పాలా—" అన్నాడు పైకి.

"వస్తాను బావా" అంది సత్యవతి.

ఇద్దరు బండెక్కారు. సూర్యం కళ్లల్లో రెండు కన్నీటి బొట్లు రాలాయి సత్యవతి కళ్ళలోనూ కన్నీటి చుక్కలు లేకపోలేదు. బండి కదిలింది, సుదూర తీరాలకు వెళ్ళి పోయింది.

గదిలో రాత్రి—

మంచం అందంగా అలంకరించారు. రమాపతి కూర్చున్నాడు. బుర్ర అలో



చిస్తోంది. 'ఇది'—అని మనం ఖచ్చితంగా చెప్పలేము. ఎక్కడా ముఖంలో చిరునవ్వు లేదు. ఏవో పిచ్చి ఆలోచనలు.

సత్యవతి వచ్చింది. నడకలో కల హంస వయ్యారం, నవ్వులో మన్మధుని విరిపూలజల్లు, హృదయంలో పుటకలేసే కోరిక, శరీరంలో రగుల్కొనే తాపం, పాలగ్లాసుతో వచ్చింది. భర్తకు అందించింది. రమాపతి తీసుకున్నాడు. కాని త్రాగలేదు. ప్రక్కనే పెట్టేశాడు.

కాసేపు ఇద్దరూ మాట్లాడుకో లేదు. సత్యవతికేవీ పాలుపోలేదు.

"ఏమిటలా వున్నారు?"

"ఎలా వున్నాను?"

"ఎలాగో వున్నారు."

"ఎలా వుండ మంటావు?"

"యిలాగ"—ముద్దు పెట్టుకుంది.

రమాపతిలో ఏదో భీతి బయలుదేరింది. తానే శాస్త్రాల్లోనూ ఇలాంటి 'భార్య'ను చదవలేదు. కనీసం నేటి సినిమాల్లో కూడా చూడలేదు. తన భార్య పాతివ్రత్యం, శీలం, గుణం...ఎలాంటివి? అడగాలనుకున్నాడు. ఎలా అడగటం. తనకు వచ్చినప్పటినుంచి సూర్యం మీద అనుమానం. అయినా యీ సమయంలో ఏవిటీ ఆలోచనలు? అవును—యిప్పుడు కాకపోతే మరెప్పుడు? ఒకవేళ నా భార్య పతిత అయితే ఎలా అనుభవించగలను జీవితం? అడగాలి. తెలుసుకోవాలి. ఇదే సమయం.." ఇవి రమాపతి ఆలోచనలు. పరమ Synic fellow. పాడు ఆలోచనలు.

"సూర్యం—ఎవరు?" అడిగేడాడు.

"యిప్పుడా సంగతెందుకు"—వడిలో తల వాల్చింది.

ఒక్కగెంటు గెంటాడు. సత్యవతిలో మత్తు వదిలింది.

"అతను మా మేనమామ కొడుకు."

"నీకు అతనికి ఏమన్నా సంబంధం వుందా?"

"వుంది."

"ఎలాంటిది?"

"అతను నాకు బావ."

"అది కాదు నే నడిగేది. మీ ఇద్దరూ ఎప్పుడన్నా కలుసుకున్నారా?"

"చాలాసార్లు."

"అంటే."

"చిన్నప్పటి నుంచి కలుసుకుంటూనే వున్నాము. నన్ను చాలాసార్లు ముద్దు పెట్టుకున్నాడు."

రమాపతి ఆ మాటతో హతవుడయాడు. వళ్ళు చమట పట్టింది.

"ఇంకా ఏం చేశాడు."

"ఇంకేవీ చెయ్యలేదు. ఏదో చెయ్యబోతే నేనే వద్దన్నాను. పెళ్ళి చేసుకుందామన్నాను."

"మరి అతన్నే చేసుకోక పోయావా?"

"పెద్ద వాళ్ళు మిమ్మల్ని భర్తగా ఇచ్చారు."

"అంటే నీకు నేను ఇష్టంలేదన్న మాట."

"అదేం మాట. మీరు నా సర్వస్వం. నా దైవం. మీకు తప్ప నే నెవరికి అంకితను కాదు."

రమాపతికి మతిపోయింది. ప్రాణాలే పోతున్నాయి. ఏం చెయ్యాలో తెలియలేదు. చాచి ఒక్క లెంపకాయి కొట్టాలనుకున్నాడు. కాని కొట్టలేదు.

"సూర్యం నీ దృష్టిలో లేడా?"

"లేడు. మీరు నాకు తాళి కట్టిన రోజు నుంచి నా కతడు పరాయివాడే. అతను నాకు మేనమామ కొడుకు మాత్రమే. ఇంకేవీ కాడు."

"అవు నీ వంగనాచి కబుర్లు—రమాపతి కంఠం మ్రోగింది.

సత్యవతి తృళ్ళిపడింది. అసలు విషయం ఆమెకు అర్థంకాలేదు.

రమాపతి తలగడ దుప్పటి తీసుకొని క్రింద వేసుకున్నాడు. కైపెక్కిన శరీరంతో సత్యవతి ఉస్సురుమంది. రమాపతిని ఒక్కసారి కౌగిలించుకుంది. అతను ఒక్కతోపు తోసాడు మంచంమీద పడింది. సత్యవతికి చిరాకొచ్చింది. అసహ్యమేసింది. అలాగే పడి నిద్రోయింది.

తెల్లవారింది. సత్యవతి మేల్కొంది. గతరాత్రి గుర్తొచ్చింది. క్రిందికి చూసింది. భర్తలేడు. కంగారుపడింది. యిల్లంతా వెదికింది. "ఏమండీ ... ఏమండీ"— కేకలు పెట్టింది. అత్తగారు మామగారు నిద్ర మేల్కొన్నారు.

"ఏమయిందమ్మా" అన్నారు.

"వారు కనిపించటం లేదు."

"రమా" కేకేసారు మామగారు.

"పతీ" పిలిచింది అత్తగారు.

అంతా వెదికారు. ఎక్కడా రమాపతి లేడు. వీధి అరుగుమీద చూచారు. దొడ్లోనూ వెతికారు. అత్తగారు ఏడ్పు మొదలెట్టారు. మామగారు చాలా కంగారు పడి పోతున్నారు.

బాగా తెల్లవారింది. సూర్య కిరణాల కాంతి బాగా పడింది. రమాపతి శవం నూతిలో తేలింది.

యిల్లంతా ఘొల్లుమంది. నలుగురు వచ్చారు. అందరు అనరాని మాటలన్నారు సత్యవతిని—

"వచ్చింది—మొగుణ్ణి పొట్టన బెట్టుకుంది."

"మహాకాళి—అరగించింది."

"ఏం అందమే తల్లి."

"ఎంత విడ్డూరపు ఆడది."

అనేక రకాలు. సత్యవతి గుండెలు భయంకరంగా కొట్టుకున్నాయి. దుఃఖ పరితప్త హృదయంతో తల్లడిల్లి పోయింది. దుఃఖం, కష్టం, విచారం, ఏడ్పులు, పెడబొబ్బలు .... వీటిగురించి ఆమెకు తెలీదు.

పుట్టింటి కెళ్ళింది. వారం రోజులు అయింది. బుగ్గల్లో కాంతి తగ్గింది. తెల్లని కళ్ళు చింతనిప్పు లయ్యాయి. ఏం చెయ్యాలో తెలియక భీతిహరిణి లా శూన్యంలో చూస్తూకూర్చుంది.

సూర్యం వచ్చాడు.

"సత్య .సత్య ." కేకలు పెట్టాడు.

మూల కూర్చున్న సత్య దగ్గిర కెళ్ళాడు. బుజ్జగించాడు. ఆమె దుఃఖం మరింత ఎక్కువయింది.

"బావా"—అంటూ సూర్యం గుండె మీద తలపెట్టుకొని బావురు మంది. కథంతా చెప్పింది.

సూర్యానికి వాడి ప్రవర్తన అసహ్యమేసింది. ఆమెను ఓదార్చాడు—

"నేవున్నాను బాధపడకూ—" కన్నీళ్లు తుడిచాడు. కొద్ది రోజుల్లోనే సత్యవతి పూర్తిగా రమాపతిని మరిచి పోయింది.

సూర్యం గుండెల మీద హాయిగా నిద్రపోయింది.